క్లుప్తంగా

పోలీసుల సాయంతో చెట్ల తొలగింపు



రోడ్డుపై పడిన చింత చెట్టును తొలగించిన పోలీసులు

సీతానగరం: మండలంలో గురువారం వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా కూలాయి. జాతీయ రహదారిపై అంటిపేట ఎఫ్‌సీఐ గోదాం వద్ద భారీ చింత చెట్టు కూలిపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీన్ని గుర్తించిన ఎస్‌ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు. ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఆటోను బస్సు ఢీకొని ఒకరికి గాయాలు



పణుకుపేట జంక్షన్ వద్ద ఆటోను ఢీకొట్టిన బస్సు

సీతానగరం: మండలంలోని జాతీయ రహదారిపై పణుకుపేట జంక్షన్ వద్ద గురువారం ఉదయం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు బొబ్బిలి నుంచి పార్వతీపురం వెళ్తున్న సమయంలో పణుకుపేట జంక్షన్ వద్ద ఆటోను ఢీ కొట్టడంతో ఆటోలో ఉన్న ప్రయాణికుడుకి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడికి స్వల్ప గాయాలయ్యాయని తెలియవచ్చింది.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం రూరల్: నియోజకవర్గ బీసీ సెల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొర్లి మాధవరావు తల్లి మాజీ కౌన్సిలర్ గొర్లి పార్వతి ఇటీవల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్వతీపురం పట్టణంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని పార్వతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మరణం తీరని లోటుగా విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ అంతిమ సంస్కారం కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, కౌన్సిల్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్యాంకు సేవలకు అంతరాయం

పాచిపెంట: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలకు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు అంతరాయం కలుగుతుందని బ్రాంచ్ మేనేజర్ పీడిక సునీల్ తెలిపారు. బ్యాంకులో పలు శాఖల అనుసంధానం నేపథ్యంలో సర్వర్ సమస్యలు తలెత్తే నేపథ్యంలో సేవలకు అంతరాయం కలుగుతుందని ఖాతాదారులు గమనించి సహకరించాలని కోరారు.

స్వచ్ఛత వారియర్ అవార్డుకు రాజు ఎంపిక

సాలూరు: స్వచ్ఛంధ్రా అవార్డ్ 2025కు సాలూరు మున్సిపాలిటీ రాష్ట్రంలో అవార్డు గెలుచుకున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. స్వచ్ఛత వారియర్స్ కేటగిరి కింద రాష్ట్రంలో స్థాయిలో మూడు మున్సిపాలిటీలు ఎంపిక కాగా సాలూరు నుంచి పీహెచ్ వర్కర్ తుపాకుల తవుడు రాజు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా స్థాయిలో 47 అవార్డులకుగాను మున్సిపాలిటీకి ఆరు అవార్డులు వచ్చాయని పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కమిషనర్ రత్నకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు అభినందించారు.

వృద్ధులకు తప్పని రేషన్ కష్టాలు



పట్టణంలో డిపో వద్ద రేషన్ తీసుకుంటున్న వృద్ధురాలు

సాలూరు: రేషన్ సరుకుల విషయంలో గిరిశిఖర గ్రామాల ప్రజలు, వృద్ధుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలోని కూర్మరాజుపేట డిపోకు చెందిన ఎమ్.అకమ్మ అనే వృద్ధురాలికి వేలిముద్రలు పడక రేషన్ ఇవ్వలేదు. సాలూరుకు వెళ్లాలని పలువురు తెలపడంతో ఆమె సుమారు 3 కి.మీ దూరంలో ఉన్న పట్టణానికి చేరుకుంది. పట్టణంలో 5వ నంబరు డిపోలోనే ఐరిష్ ద్వారా రేషన్ ఇస్తున్నట్టు తెలుసుకున్న ఆమె అక్కడకు నానా అవస్థల నడుమ వెళ్లింది. ఆ డిపోలో ఆమెకు రేషన్ అందించారు.

ఈదురుగాలుల బీభత్సం

- వర్షాలతో సతమతం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు
- మొక్కజొన్న, జీడి మామిడి, అరటి పంటలు ధ్వంసం



పార్వతీపురం రూరల్: మండలంలో నేలమట్టమైన విద్యుత్ స్తంభాలు



మక్కువ : బీరమాసిలో నేలకొరిగిన మొక్కజొన్న పంట



పార్వతీపురం రూరల్: వెంకంపేట ప్రారంభంలో రహదారికి అడ్డంగా నేలకొరిగిన చెట్టు

పార్వతీపురం రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలోని గురువారం వేకువజాము నుంచి కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు పలు గ్రామాల్లో, పంట పొలాల్లో 22 విద్యుత్ స్తంభాలు నేలకొరిగి మండలంలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంగంవలస పంచాయతీలో సీతంపేట, సమీప గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులకు చెందిన జీడి మామిడి, మొక్కజొన్న పంటలు వర్ష బీభత్సానికి నేలమట్టమయ్యాయి. మండలంలోని దాదాపు 30 ఎకరాల్లో వివిధ పంటలు ధ్వంసమైనట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. పెదమరికి, తేలునాయుడు వలస, వెంకంపేటలతో పాటు పలు గ్రామాల వద్ద భారీ వృక్షాలు నేలమట్టం కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల గ్రామస్తులే నేలకొరిగిన చెట్లను తొలగించే ప్రయత్నాలు చేశారు. అలాగే విద్యుత్ పనులకు సంబంధించి గురువారం సాయంత్రం నుంచి గ్రామీణ విద్యుత్ శాఖ సిబ్బంది పునరుద్ధరణ పనులు ప్రారంభించగా శుక్రవారం సాయంత్రం వరకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను మరలా నిలిపి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పనులు నిర్వహించారు.

నేలకొరిగిన మొక్కజొన్న పంట

మక్కువ: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షం, గాలుల కారణంగా పలు గ్రామాలలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. బీరమాజి, సిరివొర, మెండంగి, పనసబద్ర, నంద తదితర గ్రామాలలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. శుక్రవారం వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంట నష్టాన్ని పరిశీలించారు. వ్యవసాయ శాఖ ద్వారా సుమారు 78 ఎకరాల్లో ప్రాథమికంగా పంటకు నష్టం జరిగినట్టు గుర్తించామన్నారు.



పార్వతీపురం రూరల్: దోకిశీలలో దారికి అడ్డంగా నేలకొరిగిన వృక్షం



పార్వతీపురం రూరల్: సీతంపేటలో భారీ ఈదురు గాలులకు పూర్తిగా నేలమట్టమైన మొక్కజొన్న పంట



బలిజిపేట: పంట నష్టాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

సీతానగరంలో...

సీతానగరం: మండలంలో రెండు రోజులు పాటు వీచిన ఈదురు గాలులు, కురిసిన వర్షానికి పలు పంటలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లక్ష్మీపురం – వెంకటాపురం గ్రామాల మధ్య వరి చేలు నీట మునిగాయి.

అరసాడలో అరటి పంటకు నష్టం

బలిజిపేట: దసరా నాటి వర్ష ప్రభావంతో అరసాడలో ఏడెకరాలలో నలుగురు రైతులకు సంబంధించి 600 అరటి మొక్కలకు నష్టం వాటిల్లినట్టు హార్టీకల్చర్ అధికారిణి ప్రత్యూష తెలిపారు. వారి వివరాల ప్రకారం మండలంలో అరసాడలో మాత్రమే నష్టం ఎక్కువగా వాటిల్లిందన్నారు. ఏడెకరాలలో నలుగురు రైతులకు చెందిన 600మొక్కలు పూర్తిగా నేలకొరిగి నష్టం వాటిల్లిందన్నారు. ఎకరానికి రూ.20వేల వరకు నష్టం అంచనా జరిగినట్టు ఆమె తెలిపారు.

విద్యార్థుల మరణాలకు బాధ్యులెవరు?

పార్వతీపురం టౌన్: కురుపాం రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థుల మరణాలకు బాధ్యులు ఎవరని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురుపాం రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుపాం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న పువ్వల అంజలి, తోయక కల్పన అనే ఇద్దరు విద్యార్థులు జ్వరం, పచ్చ కామెర్లతో చనిపోవడం బాధాకరమన్నారు. అధికారులు, పాలకుల అసమర్థత వల్ల విద్యార్థుల ప్రాణాలు పోతున్నాయన్నారు. విద్యార్థుల మరణాలు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో ఎందుకు జరుగుతున్నాయో అధికారులు పాలకులు ఆలోచించాలన్నారు. విద్యార్థుల పట్ల అధికారులకు బాధ్యత లేకపోవడమే అన్నారు. దీనికి కారణం మెనూ సక్రమంగా అమలు కాకపోవడమే అన్నారు. పచ్చ కామెర్లతో దాదాపు 50 మంది విద్యార్థులు బాధపడటం చూస్తుంటే తాగునీటి వైఫల్యం కానవస్తోందని ఆరోపించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రి ఉన్నప్పటికీ గిరిజన విద్యార్థులకు ప్రాణాలు ముప్పు తప్పడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు తగ్గట్టు మెను చార్జీలు పెంచాలన్నారు. ఎస్సీ సెల్ చైర్మన్ కోల కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేళ.. దంచికొట్టిన వాన..

సాలూరు:

దసరా పండగకు తుఫాన్ ప్రభావం గట్టిగా కనిపించింది. గురువారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో దసరా సందడి పట్టణంలో కనిపించలేదు. ఇళ్లలో పరికరాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు సాదాసీదాగా చేసుకున్నారు. సాయంత్రం కొంత వర్షం తెరిపివ్వడంతో పలువురు భక్తులు స్థానిక ఆలయాలకు వెళ్లారు. ప్రతి ఏడాది వందల సంఖ్యలో పాచిపెంట మండలం పి.కోనవలస దుర్గాదేవి ఆలయానికి ప్రత్యేక పూజలకై వెళ్లే వాహనాలు ఈ ఏడాది తుఫాన్ ప్రభావంతో వాహనాల రద్దీ కనిపించలేదు.

మంత్రి మొదటి సంతకం ఇచ్చిన హామీ ఏమైంది!



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: గిరిజన, స్త్రీ శిశు శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పెట్టిన మొదటి సంతకం ఇచ్చిన హామీ ఏమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యమ్మల మన్మధరావు, దావాల రమణ ప్రశ్నించారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యం జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య సిబ్బంది ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలో అవసరమైన వైద్య సిబ్బంది లేకపోవడంతోనే విద్యార్థుల మరణాలు సంభవిస్తున్నాయని ధ్వజమెత్తారు. గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీని విస్మరించారని, ఇప్పుడు విద్యార్థులకు మరణాలకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్లు గొర్ల వెంకటరమణ, బివి.రమణ, ఎన్‌వై నాయుడు, వి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దసరా ఉత్సవాలు



మక్కువ దిగువవీధిలో అగ్నిగుండం దాటుతున్న భవానీ భక్తులు

మక్కువ: మండలంలోని గురువారం దసరా పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసినప్పటికీ, వాహనాలకు భక్తులు ఆరుబయటే వర్షంలో తడుచుకుంటూ పూజలు చేశారు. స్థానిక దిగువవీధిలో కోటదుర్గమ్మ ఆలయం వద్ద గురువారం రాత్రి భవానీ భక్తులు అగ్నిగుండాలను ఏర్పాటుచేసి, వాటిపై కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కోటదుర్గమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని శరన్నవరాత్రులను పురస్కరించుకుని గురువారం సాయంత్రం భవానీలు ముడుపులు పూజలు చేసిన అనంతరం రాత్రి దుర్గాదేవి అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నవరాత్రులు అమ్మవారికి ఆటో స్టాండ్ వద్ద అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం సువర్ణముఖీ నదిలో శివాలయం రేవులో వాహనాల్లో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అనుపోత్సవం చేశారు. లక్ష్మీపురంలో సర్పంచ్ టి.సత్యవతి నిర్వాహకులు టి.వెంకటరమణ ఆధ్వర్యంలో దుర్గాదేవి అనుపోత్సవం జరిగింది. అలాగే మరిపివలస, చినబోగిలి, బగ్గందొరవలస గ్రామాల్లో అనుపోత్సవం నిర్వహించారు. అనుపోత్సవం అనంతరం ఇంద్రకీలాద్రిపై వేంచేసిన కనకదుర్గ ఆలయం, రాయగడ మద్యగౌరీ ఆలయాల్లో మొక్కులు తీర్చుకునేందుకు భవానీలు పయనమయ్యారు.

ప్రజలకు చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించాలి : కలెక్టర్

పార్వతీపురం టౌన్:

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ద్వారా జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు చేకూరే లబ్ధిపై వారికి అవగాహన కలిగించాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జీఎస్టీ శాఖ, పారిశ్రామిక శాఖ, చేనేత పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జీఎస్టీ ఎగ్జిబిషన్, వర్క్‌షాప్, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా సంస్థ, ఒక జిల్లా, ఒక ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 22, 2025 నుంచి తగ్గించిన జీఎస్టీ వల్ల ప్రజలకు ఆర్థికంగా మేలు కలుగుతుందని అన్నారు.

జీఎస్టీ సంస్కరణలు 2.0 కార్యక్రమానికి విస్తత ప్రచారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 25 నుంచి ఈ నెల 19 వరకు నిర్వహిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరికీ జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల చేకూరే లబ్ధిపై వివిధ కార్యక్రమాల ద్వారా వారికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జీఎస్టీ తగ్గింపుతో మారే ధరలపై దుకాణదారులకు అవగాహన కల్పించి తగ్గిన ధరలతోనే వస్తు విక్రయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జీఎస్టీ శాఖ డిప్యూటీ కమిషనర్ మరియు నోడల్ ఆఫీసర్ డేవిడ్ అనిల్ కుమార్, పార్వతీపురం సర్కిల్ సహాయ కమిషనర్ జి.లక్ష్మి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా చేనేత పరిశ్రమల శాఖ అధికారి ఎస్.వెంకటరమణ, జిల్లా కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుదేవ రాజు తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి

పాము కాటుకు గురై వ్యక్తికి అస్వస్థత

సీతానగరం: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కర్రి ఈశ్వరరావు శుక్రవారం రాత్రి ఇంట్లో పాము కాటుకు గురయ్యాడు. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రామవరం గ్రామానికి చెందిన ఈశ్వరరావు నందెన్న పండగ నిర్వహించడానికి కుటుంబీకులతో వరండాలో కూర్చొని ఉండగా గుర్తు తెలియని పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు బొబ్బిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జాతిపిత మార్గం అనుసరణీయం



సాలూరు: గాంధీజి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తదితరులు

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: భారతదేశానికి స్వాతంత్య్రం తీసుకురావడానికి మహాత్మాగాంధీ అహింసా పద్ధతిలో చేసిన పోరాటం మరువలేనిదని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో తన గృహం వద్ద బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింస ఆయుధంగా దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చేందుకు గాంధీజీ పోరాటం చేశారన్నారు. ఆయన మార్గం నేటి యువతకు మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

పార్వతీపురం రూరల్: గాంధీ జయంతి సందర్భంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మజ్జి శోభారాణి కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జి శేఖర్, మండల ప్రజాపరిషత్ అధికారులు పాల్గొన్నారు. మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నల్ల బాలకృష్ణ నివాళులు అర్పించారు.

సీతానగరంలో..

సీతానగరం: జాతిపిత ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆర్యవైశ్య సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు, మండల కమిటీ అధ్యక్షుడు కూర్మదాసు లక్ష్మణరావు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహం వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సేవా సంఘం జిల్లా, మండల నాయకులు కె.శ్రీనివాసరావు, ఏవీ సత్యనారాయణ, గోవిందరావు, పీఏసీఎస్ ప్రతినిధి వాసు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ మజ్జి శోభారాణి తదితరులు



సీతానగరం: గాంధీ విగ్రహం వద్ద నివాళులు

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ జ్ఞాన ప్రసూనాంబ

గుమ్మలక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం 431 వస్తువులపై జీఎస్టీ చార్జీలను తగ్గించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పన్నుల శాఖ డిప్యూటీ అసిస్టెంట్ జ్ఞాన ప్రసూనాంబ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె..జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై కొనుగోలు భారం తగ్గిందన్నారు. సవరించిన జీఎస్టీ శ్లాబ్‌ల ప్రకారమే వస్తువులు విక్రయించాలని దుకాణాదారులను ఆదేశించారు. ఆమె వెంట డీఎస్‌డీవో డి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.